అంతస్థులు

★

శ్రీ పన్యాల రంగనాథరావు

1

విశ్వం తన చిన్ననాటి స్నేహితుడైన సుందరానికి ఉత్తరం రాసినప్పుడు, దానికొక సమాధానమంటూ వస్తుందనిగానీ, ఆ సమాధానం తన కింత అనుకూలంగానూ, ప్రోత్సాహకరంగానూ ఉంటుందనిగానీ ఎన్నడూ నమ్మలేదు.

సుందరం, తనకన్న రెండేళ్లు చిన్నవాడు కూడాను. అయితేనేం? ముప్ఫయి ఏళ్ళకే దాదాపు వెయ్యిరూపాయల జీతగాడైనాడు. భారతదేశానికి కేంద్ర మనిపించుకుంటున్న ఢిల్లీ పట్నంలో మకాం వేశాడు. తనకు కావలసినంత అధికారం ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. ఈ ఉత్తరమే తార్కాణం.

అదృష్టం అందరికీ ఎన్నడూ కలిసిరాదు. సుందరంవంటివారిని, లక్ష్మిచేపడుతుంది. తనవంటి వారికి ఉన్న దరిద్రంతోపాటు మరికొంత కలిసి వస్తూ ఉంటుంది.

దీనంతటికీ కారణం అంతస్థులు కాకుంటే మరేమిటి? సుందరం ఉంటున్న అంతస్థులో, ప్రవేశించటానికికూడా తనకు అర్హత లేదు, ఆర్థికంగా.

అసలీ దరిద్రంవల్లనే మూడేళ్ళపాటు తను ఇంటరులో చేరటానికి వీలులేకపోయింది. తనకు కూతురుని ఇచ్చుకున్న మేనమామే, తన చదువు సాగటానికి దిక్కనక తప్పలేదు. ఇటువంటి సమయంలో తను చదువు సాగించటం, విశ్వానికి బొత్తిగా ఇష్టం లేకపోయినప్పటికీ, మామయ్య బలవంతంవల్లా, ప్రాధేయంగా లీల చూసిన చూపువల్లా విశ్వం, మూడేళ్ల విరామం తర్వాత, మళ్లీ చదువుకు పడ్డాడు.

ఇది దాదాపు ఒక పుష్కరం వెనకటిమాట. అప్పుడే తనకీ సుందరంతో స్నేహమయింది. తనూ సుందరం దాదాపు అయిదేళ్లపాటు, పట్నంలో సాహచర్యం వెలిగించారు. బియ్యే పూర్తిచేసి విశ్వం తిరిగి ఇల్లు చేరుకున్నాడు. వెనకటి స్థితిగీ అప్పటి స్థితికీ, తనమట్టుకు తనకేమీ మార్పు కనిపించలేదు. సుందరం మట్టుకు రెండేళ్లపాటు విదేశయాత్రకూడా చేసి సరాసరి ఢిల్లీకేపోయి, మంచి ఉద్యోగంలో ప్రవేశించాడు.

సుందరంవంటి వాళ్లకి, మంచిమంచి ఉద్యోగాలు, లడ్డుండల్లాగా దొరుకుతై. అయితే ఏ మాట కామాటే చెప్పుకోవాలి. అటువంటి ఉద్యోగాలు దొరకాలంటే, అందుకు కావలసిన అర్హతలు కూడా ఉండాలి మరి. సుందరం విదేశయాత్ర చేసి వచ్చాడు. సుందరం నాన్నగారికి, వెనక కాంగ్రెసులో పనిచేసి ఉండటం మూలాన, మంత్రులతో చక్కని పలుకుబడి ఉంది. సుందరం ఉద్యోగానికి అన్ని హంగులూ సమకూర్చుకోగానే, ఠక్కున లడ్డుండ కాస్తా నోట్లో పడింది.

సుందరం గురించి, విశ్వానికి ఎప్పటికప్పుడు ఆనోటా ఆనోటా, సమాచారం యావత్తూ తెలుస్తున్నప్పటికీ, తను ఏమయిందీ సుందరానికి ఏ సంగతీ తెలీలేదనటానికి ఈ ఉత్తరమే సాక్ష్యం. అంతస్థులమీదఉన్న సుందరాన్ని ఇందుకు తప్పుపట్టవలసిన పనిలేదు.

విశ్వం చదువుకి స్వస్తిచెప్పాక ఇంతవరకూ అనేక అవతారాలు ఎత్తాడు. వీటన్నింటిలోనూ, తనకు అభిమానపాత్రమైనది కథకుడి అవతారం. ఈ అవతారమే తన సహజమైన అవతార మనిపించింది విశ్వానికి. ఉత్తమకథకుల జాబితాలోకి కూడా అతను ఎక్కకపోలేదు. అయితే, తన కథలను ఆదరించినట్టుగా, దేశం తన్ను ఆదరించలేదు. ఇందుకు, కథకుడిగా తనకు అలవడిన సంస్కారంవల్ల, విశ్వానికి దేశంమీద జాలికలిగిందేకాని, కోపంరాలేదు.

అయితే, ఈ సంస్కారం విషయంలో తను అనేక అంతస్థుల పైకెక్కిన విషయం, తెలిసిరాటానికి, సుందరమే కారకుడైనాడు.

సుందరం ఎంత సంస్కారం పొందిఉండక పోతే, తన ఉత్తరానికి సమాధానమంటూ రాస్తాడు, అని కూడా విశ్వం పొరపాటు పడ్డాడు. ఇట్లాపొరపాటు పడటానికి కారణం లేకపోలేదు.

"నువు పెద్ద ఉద్యోగంలో ఉంటున్నావని విని చాలా ఆనందించాను. ఎప్పటికప్పుడు నీ గురించి భోగట్టాలు తెలుసుకుంటూనే ఉన్నాను. నాటి నుంచీ, నేటిదాకా, నాకు స్థిమితంగా, ఎటువంటి ఆర్జనకూ అవకాశం చిక్కలేదు. తెనుగు దేశం, నాకు ఒక కథకుడిగా బోలెడంత పేరు మాట గట్టి ఇచ్చింది. ఆ మాట విప్పతే, నన్ను కట్టుకున్న కళా, నా నాలుగేళ్ల పిల్లవాడూ, ఏడుపు ముఖం పెట్టి కనిపించారు. నన్నేం చేయమంటావు? నీ పలుకుబడితో, నాకింత ఆసరా కలిగించకపోవనే ధైర్యంతోనే, ఈ ఉత్తరం-అసలిది నీకు సరిగా అందుతుందో అందదో కూడాను-రాశాను. దీన్ని కేవలం నా అక్షయ పాత్రగా పరిగణించవనీ, మన కాలేజీ రోజులు నీకు జ్ఞాపకం ఉండక పోవనీ నా విశ్వాసం."

విశ్వం, తను రాసిన ఈ ఉత్తరంలో ఆఖరు వాక్యం, ఉద్దేశ పూర్వకంగా రాసినదే! ఆ వాక్యం ఒక కొలబద్దగా పెట్టుకునే, సమాధానం రాక పోవచ్చుననుకొన్న విశ్వం సమాధానం రావటంతో, పప్పులో కాలు వేశాడు.

"విశ్వం! నీ ఉత్తరం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. నీకింత కాలం ఉద్యోగం లేదంటే నమ్మలేక పోయినాను. కథకుడుగా నీకు లభించిన కీర్తిని అక్కడే విడిచిపెట్టి నువు తక్షణం బయల్దేరి రా. నీకు ఉద్యోగం కావాలంటే, దొరక్క పోదు..."

ఈ ఉత్తరం అందాక. అంత దూరం వెళ్లటమా మానడమా అని క్షణం పాటు విశ్వం సందేహంలో పడక పోలేదు. కాని, తను ప్రయాణం కట్టటానికి, తనకు కావలసినంత ఉత్సాహమూ లీల ఇచ్చింది. మర్నాడే విశ్వం, వంద రూపాయలు అప్పు చేసి, ఢిల్లీకి ప్రయాణం అయినాడు.

2

విశ్వం ప్రయాణం చేస్తున్నంత కాలమూ, తను తలపెట్టిన ఈపని ఎంతవరకూ సమంజసమని ఆలోచించసాగాడు. ఎందువల్లనంటే, ఈపని చేయటం కోసం, తన జీవితంలో అతి ముఖ్యమైన ఒక నియమం భంగపరుచుకోవలసి వచ్చింది. ఇంతవరకూ ఎవరినీ ఏదీకూడా అర్థించి ఎరగడు విశ్వం. ఇప్పుడు— ఇంతదూరం ఎందుకు వెళ్ళవలసివచ్చిందో ఊహించటం అంత కష్టంకాదు.

తండ్రికి ఎటువంటి ఆర్జనా లేదు. రెండేళ్ళ బట్టి, ఈ కుటుంబభారమంతా బలవంతాన తనే నెత్తిమీద వేసుకోక తప్పలేదు. ఒక విధంగా తన కన్నా తన తమ్ముడు నయం. వాడు ఒక పెట్ట తన చదువు సాగించుకుంటూ, మరో పెట్ట, ఇక్కడా అక్కడా ఏవో ట్యూషన్లు చెప్పుకొని, ఆ వచ్చిన డబ్బులతో చదువు సాగించుకొంటున్నాడు. కానీ పరకా మిగులుతే కూరా నారా తెచ్చిపడేస్తాడు. పుటుకతోనే, వాడికి కష్టాలు నాటినై. దరిద్రంలోనే పుట్టాడు. తన కట్లా కాదు. తల్లీతండ్రీ గారాబంకొద్దీ తన్ను చిన్నప్పుడు పువ్వుల్లో పెట్టి పెంచుకొచ్చారు. ఫలానా లోపం అనే విషయం వొంటికి నాటకుండా తన్ను పెద్దవాణ్ణి చేశారు. తన యథార్థాన్ని తనే హటాత్తుగా గుర్తించుకోవలసి రావటంతో విశ్వం, మొదట్లో ఉక్కిరిబిక్కిరైనాడు. ఇక తన చెల్లెలుంది. దానికి పెళ్ళీడు వచ్చేసింది. ఈకాలం చదువులేని ఆడపిల్ల ఎందుకూ పనికిరాదు. తన చదువుకే మూడు చెరువులు ఎండకొట్టాడు తన తండ్రి! తన తల్లి పేదవాళ్ళ ఇంట్లోనే పుట్టింది. పేదవారి చేతిలోనే పడింది. ఈ పేదకుటుంబాన్ని ఈడ్చుకురావటం ఆమెకే చేతవును. ఈ పరిస్థితుల్లో పుట్టిమునిగినట్టు తనకు పెళ్ళి జరిగిపోయింది. దీనంతటికీ కారకుడు తన మేనమామ. తన కూతురికి ఈడు మించిపోతున్నదని తొందరపెట్టి అమ్మనీ నాన్ననీ వొప్పించాడు. లీలనే చేసుకోవాలని చిన్నతనం నుంచీ తనకు కోరిక ఉండేది. మామయ్య తన కూతురికి చదువు చెప్పించలేదు. తను ఉద్యోగం చేసుకొంటూ లీలకు చదువు చెప్పించుకోవాలని విశ్వం ఆశయాలలో ఒకటి. ఏ ఆశయమూ ఫలించనట్టుగానే అదికూడా ఈనాటికీ ఫలించలేదు. ఇప్పుడు, నాలుగేళ్ళ పిల్లవాడిని పెట్టుకొని, చదువుకొమ్మంటే చదువుతుందా?

"నా చదువు ఇప్పుడంత ముఖ్యం కాదు. ముందు పిల్లవాడి సంగతి ఆలోచించండి" అన్నది కూడానూ ఒక సందర్భంలో!

విశ్వం, తను చదువుకొంటున్న రోజులలోనే సాహిత్యంతో పరిచయం చేసుకొన్నాడు. ఏముహూర్తాన మొదటి సారి కాగితం మీద కలం పెట్టాడో గాని అతిత్వరలోనే విశ్వానికి ఒక కథకుడుగా పేరొచ్చింది. ఆర్థికంగా ఇది అంత లాభించక పోయినా, తన చేతికొచ్చిన ఈ విద్య, ఎప్పటికేనా తనకు ఒక ఆసరా చూపించక పోదనే విశ్వం గట్టిగా నమ్మాడు. ఇది కేవలం మూఢ నమ్మకం కాదనికూడా నమ్మాడు.

కొన్నాళ్ల కిందట, తనకు తెలిసినవా డొకడు ఒకపత్రిక పెట్టాడు. దానికి సంపాదకుడుగా ఆ పత్రిక పెట్టిన వాడి పేరే చెలామణీ అయినప్పటికీ, పత్రిక నడిపించే భారం తన మీద వేశాడు. ఈ భారాన్ని విశ్వం అమితఉత్సాహంతో నిర్వహించినమాట నిజం. ఇదే తన్ను పోషిస్తుందని, మొదటి రెండూ మూడు సంచికలకు నిద్రాహారాలు లేకుండా కష్టపడి పేరు తెచ్చిన వాడు తనే. పత్రిక పెట్టిన నాడు, మొదట్లో తనకు నెలకు యాభై రూపాయల చొప్పున ముట్ట చెప్పేవాడు. అదే పది వేలుగా విశ్వం స్వీకరించాడు. ఆ తర్వాతనే గట్టి చిక్కు వచ్చింది పత్రిక యజమాని ఆమోదించేవాటినీ, యజమానే స్వయంగా ఇచ్చేవాటినీ వేయవలసి వచ్చింది. ఆ విధంగా వేసే కథల్లోనూ వ్యాసాలలోనూ, సాహిత్యం ప్రయోజనం, కళా నశించి బూతు మిగిలేది. తన ఆశలన్నీ పటాపంచలు చేసుకొని విశ్వం బయట పడ్డాడు. ఇప్పుడా పత్రిక అందమైన ఫోటోలతో, ప్రణయ కథల పత్రికగా వెలువడుతూ, ఆ యజమానికి ఒక పెద్ద మేడా, ఒక కారూ తెచ్చి పెట్టింది. తన అంతస్థులో ఉన్న సాహిత్యానికి, ఈ దేశంలో, డబ్బు చేసుకొనే యోగ్యత ఇంకా పట్టలేదు.

ఆ తర్వాత విశ్వం ఒక రేషను దుకాణంలో పనిచేయటం, వేరే కథగా రాయవలసి వుంటుంది. ఆ రేషను దుకాణంలో చాటుగా పువ్వుల్లాంటి బియ్యం ఎంతిపడితే అంతా దొరకటం, రేషనుమీద చూస్తే పశుగ్రాసంగా కూడా పనికిరాని బియ్యం లభ్యం కావటం ఇట్లా జరుగుతూ ఉండటానికి, పాలకులే చేతనైనంతగా దోహదం చేయటం, విశ్వానికి అసహ్యం వేసి బయటపడ్డాడు. తన మూడో అవతారంలో విశ్వం, రెండుమూడు పెద్దషాపులలో ఉత్తరాలు రాసిపెట్టడం. ఇదికూడా ఆశే నచ్చలేదు. అయినప్పటికీ తను సుందరానికి తెగించి ఉత్తరం రాసేవరకూ ఈ పనే చేస్తూవచ్చాడు. రేడియోకి నాటకాలు రాయడంవల్లా, పత్రికలు పంపే పదిపదిహేనులవల్లా, అంతా కలిపి నెలకో యాభై అరవై అయినా తన సంసారం ఈదటానికి పదిరోజులకు కూడా సరిపడేదికాదు. బాధ్యతలు ఎక్కువవుతున్న కొద్దీ, విశ్వానికి, తనమీద తనకే నమ్మకం క్షీణించసాగింది. ఇక ఉద్యోగంకోసం, గట్టిగా అర్థించకపోతే లాభంలేదు. తనమీద ఆధారపడ్డ వారికి తిండిపెట్టగలగడంలో తన నియమం భంగం అవుతే వొచ్చిన నష్టమేమీ లేదు. అడుగుతేగాని అమ్మయినా పెట్టదుకదా?

సుందరం, చదువుకొనే రోజులలోనే ఎంత పైఅంతస్తులలో విహరిస్తూ ఉండినప్పటికీ, తన విషయంలో అభిమానంతో మెలగటం విశ్వం బాగా ఎరుగును. సుందరంతో తన కుండిన మైత్రి, స్నేహంగా పరిగణించాడు విశ్వం. ఇప్పుడు సుందరం తన్ను ఆహ్వానించటంలో, విశ్వం స్నేహాన్ని మాత్రమే చూపగలిగాడు. ఆ స్నేహాన్ని స్తనశల్యపరీక్ష చేయటానికి మాత్రం విశ్వం అంతరాత్మ సమ్మతించలేదు.

3

విశ్వం ప్రయాణం చేస్తున్నప్పుడు తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమంతా, ఢిల్లీస్టేషనులో కాలుపెట్టడంతో పటాపంచలయినట్టు తోచసాగింది. తను ఏ నాటికి ఢిల్లీచేరుకోబోతున్నదీ సుందరానికి ముందే ఉత్తరం రాశాడు. సుందరం స్టేషనుకు వస్తాడనీ పూర్వపు స్నేహంతో తన్ను ఆహ్వానిస్తాడనీ ఊహించాడు విశ్వం. కాని స్టేషనంతా కలయచూసినా సుందరంజాడ కనపడలేదు. తనకు హిందీ కూడా రాదు. బహుశా సుందరానికి ఏదో అర్జంటుపని తగిలి ఉండవచ్చునేమో: అంత పెద్ద ఉద్యోగస్తుడు, స్టేషనుకు వస్తాడని అనుకోవడం తనదే బుద్ధిపొరపాటు.

సుందరం ఎడ్రసు తెలుసుగనక, టాంగా ఒకటి మాట్లాడుకొని, సుందరం ఉంటున్న ఇల్లు చేరుకొనేసరికి పదకొండు గంటలయింది.

ఇంటిముందు ఒకపక్కగా అందమైన కారొకటి ఆగిఉంది. పక్కనే మేడకు మెట్లు

న్నాయి. దానిమీదఉన్న బోర్డుచూస్తే, సుందరం మేడమీద కాపరముంటున్నాడని స్పష్టమయింది!

ఇంతలో పైనుంచి ఎవడో కిందకు దిగి, తన బెడ్డింగుచూసి, తన్ను ఎగాదిగా పరీక్షించి, "కోన్ హై!" అన్నాడు. వాడు హిందీలో ప్రశ్నించినా అరవకట్టులో కనిపించాడు.

"మిస్టర్ సుందరం!" అన్నాడు విశ్వం.

"మీరు తెనుగువారుదానా? సామి వెళిల పోయివుండారు. అరమణికల్లా వస్తురు. మీరు వచ్చి కూర్చోండిమి" అన్నాడు.

వీడు నిస్సందేహంగా సుందరం పనివాడు.

"ఇంట్లో ఇంకెవరూ లేరా?" అన్నాడు విశ్వం సందేహంగా.

"అమ్మ పట్నం పోయి ఉండారు. సామిదా ఉండారు. నేను వారి కుక్." అన్నాడు 'కుక్.'

కింది భాగంలో ఎవరో పంజాబీవాళ్లనుకున్నాడు విశ్వం. అంతస్థుమీద అంతా దివ్యంగా ఉంది. ఇటువంటి 'పెద్ద వాళ్ల' యిండ్లలో ముందు కాపరం ఉండటం నేర్చుకోవాలి. ముందు హాలూ, హాలులో సోఫాలూ, గోడలకు పెద్ద పెద్ద చిత్రపటాలూ, ఒక వైపు పెద్ద రేడియో, కింద తివాసీ, ద్వారాలకు రంగు రంగులు తెరలూ. ఇవన్నీ తనకు అలుక్కు పోయినట్టుగా కనిపించ సాగాయి. 'కుక్' తన బెడ్డింగు ఎక్కడికి తీసుకు పోయాడో, తన్ను ఈ అగాధంలో వొదిలి! అనుకుంటూండగానే 'కుక్' చేతిలో కాఫీతో వచ్చాడు.

"మీరిది పుచ్చుకోండి సార్. సామి ఫోను చేస్తిని. మరో పది నిమిషాలలో వస్తుండారు."

పది నిమిషాలకు సుందరం రానే వచ్చాడు. అతని వెనక మరో ఇద్దరు పెద్ద ఉద్యోగులే అయి ఉండొచ్చు—సుందరం వస్తూనే,

"హలో! విశ్వం! నీకోసమే ఎదురు చూస్తున్నా! జస్ట్ వన్ మినిట్. వీళ్లను పంపేసి వస్తాను!" అంటూ ఏదో కాగితాలు తీసుకుని వారికిచ్చి, బయటకు వెళ్లి వాళ్లను పంపేసి తిరిగి వచ్చాడు సుందరం.

విశ్వానికి శ్వాస నిలిచినట్టయింది.

సుందరం ఆప్యాయంగా సమీపించి, సోఫాలో తన పక్కనే కూర్చొని,

"ఎన్నాళ్లకు కనిపించావోయ్ విశ్వం! అయాం సోసారీ. నీ కోసం స్టేషనుకి బయల్దేరుతూండగా, అర్జంటు పని తగిలింది. నీ కోసం కారు పంపించానే. కారులో వొచ్చావా?" అన్నాడు.

"లేదు." అన్నాడు విశ్వం కాస్త ఊపిరి బిగపట్టి.

"అదేం? కారు రాలేదా యేమిటి? డ్రైవర్!" అంటూ కేక వేశాడు సుందరం.

"పోనీలెద్దూ వాడు నన్నెలా పోల్చుకుంటాడనీ! మనం మళ్లా చాలా కాలానికి కలిశాం చాలదూ?" అన్నాడు విశ్వం.

సుందరం వేసిన కేకకి, డ్రైవరు పత్తా లేడు కాని, 'కుక్' వచ్చాడు.

"చూడూ, అయ్యగారికి స్నానానికి నీళ్ళూ—ఆయన కా గదిలో అన్నీ అమర్చు," అన్నాడు సుందరం.

సుందరం ఇచ్చిన ఆతిథ్యం విశ్వానికి తాత్కాలికంగా ఎంతో సంతృప్తి కలిగించి ఉండొచ్చు, కాని, ఈ వాతావరణం విశ్వానికి గొంతులో వెలక్కాయ లాగ ఉంది. తన మామూలు జీవితంలో ఉండవలసిన స్వేచ్ఛ ఇక్కడ తనకు లభ్యం కావడం లేదు. ఏపని చేసినా, చేయాలనుకున్నా, స్నానమూ, భోజనమూ, కాలకృత్యాలు తీర్చుకోవటమూ—ప్రతీ చిన్న విషయానికికూడా, ఏదో ఒక నియమం ఉన్నట్టుగానూ, ఆ నియమం ప్రకారం ఆ పనులు చేయకపోతే, వాచీముల్లు వెనక్కు తిరిగిపోతుందేమో అన్నంత అనుమానం కలగడమూ జరుగుతోంది.

"నా భార్య పుట్టింటికి వెళ్లిందిలే. ఇది ఇంకా ఆరో నెల. ప్రస్తుతం నే నొక్కణ్ణే ఉంటున్నాను. నాన్నగారూ, అంతా పట్నంలోనే ఉన్నారు. ఆయన ఇక్కడి కెలా వస్తాడూ! ఏదన్నా మినిస్టర్లతో పనివుంటే వస్తూపోతూ ఉంటాడు. అంతే." అంటూ సుందరం విశ్వానికున్న కొన్ని సందేహాలు, తను కోరకుండానే తీర్చాడు.

తనకోసం వేరేగదిలో ఒకపక్క వేయించాడు. పడుకోబోయేముందు, రాత్రి ఇద్దరూ ఒక గంట

పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. వెనకటి కాలేజీ రోజులూ, అప్పటి మిత్రులూ, అన్నీ ఒకసారి జ్ఞాపకం చేసుకున్నారు. ఎన్ని మాట్లాడినప్పటికీ, సుందరం, విశ్వంఉద్యోగప్రసక్తి తీసుకురాక పోవడం, విశ్వానికి కొంచెం ఆశాభంగం కలిగించింది. అసలు ఆ ప్రసక్తి తనే ముందుకు తీసుకురావాలో ఏమో—ఈ వాతావరణంలో అనుకున్నాడు కూడాను.

తనకూ తను కొంతకాలంనుంచి ఎరిగిఉన్న ఒక స్నేహితుడికీ—మధ్య ఏదో ఒక గోడవంటిది ఉండటం బాధగా ఉంది. ఈ గోడపెట్టింది ఎవరు? తనా, సుందరమా? లేక, ఈ వ్యవస్థా? ఇదిమాత్రం తేల్చుకోవాలని విశ్వం తనలోతనే పరిశోధన ప్రారంభించాడు.

తను వచ్చిన పనేదో త్వరలో తేలిపోతే, భవిష్యత్తు నిర్ణయించుకోవచ్చునన్న ఆదుర్దా విశ్వానికి ఉండటం సహజమే. ఇటువంటి ఆదుర్దాలకు సుందరం ఆర్థికవ్యవస్థ అతన్ని అతీతుణ్ణిచేసిన విషయం విశ్వం గుర్తించాడు.

"ఇక్కడ ఏమున్నా ఛాన్సు..." అనబోయినాడు విశ్వం.

సుందరం మాటలోనే అడ్డువచ్చి,

"ఆలోచిద్దాం లెద్దూ. కొన్నాళ్లు ఉండాలి కదా మరి? అన్నట్టు, నువు ఏం పని చేస్తావో చెప్పు ముందు!" అన్నాడు సుందరం సిగరెట్టు ముట్టిస్తూ.

తన వ్యవహారం సుందరానికి కొంత వేళాకోళంగా ఉన్నట్టు తోచసాగింది విశ్వానికి. తను ఏవిధంగా మథనపడ్తున్నదీ గుర్తించే యోగ్యత సుందరానికి లేకపోవచ్చునని విశ్వం మొదట్లో భావించలేదు.

"నీ ఉత్తరం చూడగానే, నాకోసం ఏదో ఉద్యోగం సిద్ధంగా ఉందనిపించింది సుమా! చెప్పొద్దూ!" అన్నాడు విశ్వం కసికొద్దీ. తనవంటివాడికి కాస్త ఓర్పు హెచ్చుస్థాయిలోనే ఉండాలన్న మాట విస్మరించి.

"నేనావిధంగా రాసినట్టు నాకు జ్ఞాపకం లేదే! ఉద్యోగాలు మనకోసం అంటూ సిద్ధంగా ఉంటాయనుకోటం బుద్ధి పొరపాటు! మనమే సృష్టించుకోవాలి ఈ కాలంలో."

సుందరం అన్న ఈ మాటలలో సత్యం ఎంతేనా ఉంది. ఇది సత్యంతో కూడుకున్న మాటే అని బాధపడి విశ్వం ఒక నవ్వు నవ్వేశాడు. కాని, ఈ ఉద్యోగాలలో లొసుగులు ఈవిధంగానే ఉంటవి కాబోలు అని స్ఫురించటంతో విశ్వంలో ఒక చిన్న మంట బయల్దేరింది.

విశ్వం, హాలు నాలుగువైపులా కలయచూడటం గమనించి, సుందరం—"ఇది గవర్నమెంటు ఇచ్చిన ఇల్లేను. అసలు నా కివ్వవలసిన బంగళా ఇంకా ఖాళీ కాలేదు. అందాకా ఈ కొంపలో ఉండమన్నారు. చాలా ఇరకాటంగానూ—ఎందుకూ పొందకుండానూ ఉంది." అంటూ తన అసంతృప్తి వెల్లడిచేశాడు.

ఇది 'కొంపా'! ఇరకాటంగా ఉందా! తనవంటివాడు కాలుమోపటానికి ఇందులో, తాహతు లేదే! అంతస్థుల భేదం!

ఆ రాత్రి అంతటితో వారి చర్చ ముగిసింది.

4

నాలుగురోజులు దాటినా కూడా సుందరం, ఇదమిద్ధంగా ఏ విషయమూ తేల్చడం లేదు. విశ్వానికి ముళ్లమీద నడకగా ఉంటున్నది. ఈలోపున విశ్వం తన భార్యకు ఉత్తరం రాశాడు, సుందరం చాలా ఆదరించాడనీ ఉద్యోగం దొరికే సూచనలు ఎక్కువగానే కనిపిస్తున్నాయనీ. ఈ నాలుగు రోజులలోనూ సుందరం తనకు వీలయినప్పుడల్లా, విశ్వాన్ని పట్నమంతా తిప్పాడు. జంతర్ మంతర్ చూపించాడు. బిర్లామందిర్ చూపించాడు. చాందినీచౌక్ అంతా తిప్పాడు. కన్నాట్ పేలస్‌లో అనేక పెద్ద పెద్ద దుకాణాలకు తీసుకువెళ్తే, అక్కడివారు సుందరానికి చాలామంది సలాములు చేయటం, 'కోకాకోలా'లు ఇప్పించటం విశ్వానికి ఆశ్చర్యం వేసింది.

ఒకనాటి సాయంకాల, 'రాజ్ ఘాట్'కి వెళ్లారు. సుందరం అక్కడ ఎవరితోనో తన సాటివారితో మట్టాడుతుంటే, విశ్వం, కొద్దిదూరంలో 'వినోభావే' ప్రార్థనోపన్యాసం వింటూ, గాంధీ ఆత్మకు శ్రద్ధాంజలిస్తున్నడు.

"నీతో నాకు అనేక విషయాలలో అభిప్రాయ భేదాలు ఉంటే ఉండొచ్చుగాక. నీ విశ్వాసాలు నీవి. నా విశ్వాసాలు నావి. అయితేనేం? నువు మహాత్ముడివి. నువు జీవించిన కాలంలోనే నేను పుట్టిఉండటం—నువు మావూరికి కొన్నాళ్ళకిందట వచ్చినప్పుడు నిన్ను చూడగలగటం నా అదృష్టంలో ఒక భాగం. కొన్ని కోట్లమంది జనంమీద నీ ప్రభావం ఒక వెలుగు వెలిగిందంటే—అది నీకే సాధ్యమయింది. నీకివే నా జోహారులు." అనుకున్నాడు విశ్వం.

ఇంకోరోజు, సుందరం మరికొంతమంది పెద్దవాళ్ళతో కలిసి, 'కుతుబ్ మీనార్'కి పిక్నిక్కి పోతూ, విశ్వాన్నికూడా తీసుకువెళ్లాడు. చరిత్రాత్మకమైన ఇటువంటిస్థలాలు చూస్తున్నప్పుడల్లా విశ్వానికి, తన లీలా, పిల్లవాడూ పదేపదే జ్ఞాపకం వస్తూ బాధించసాగారు.

వారంరోజులు గడిచినై. ఒకనాటి రాత్రి సుందరం ఇంటికి వస్తూనే,

"ఇదిగోనోయ్, నీ 'ఎపాయింట్ మెంట్' ఆర్డరు. రేపు నాతోకూడా నిన్ను తీసుకువెళ్తాను. జాయిన్ అయిపో," అన్నాడు.

"ఎక్కడ—ఏ ఆఫీసులో! ఏం కథ!" అంటూనే విశ్వం కాగితం చూసుకున్నాడు.

విశ్వం చదివేలోపునే-సుందరం అందుకొని,

"మా ఆఫీసులోనే ఖాళీ వచ్చిందిలే. ఒకసారి అడుగు పెట్టేశావంటే, మెల్లిగా తన్నుకురావచ్చు." అన్నాడు.

తను ఆశించినటువంటి ఉద్యోగానికి కనీసం మూడువందలైనా జీతముంటుందనుకున్న విశ్వం, ఈ ఉద్యోగానికి కేవలం నూటయాభై మాత్రమే జీతమనీ, అమాంబాపతులతో కలిసి రెండొందలు కిట్టాయనీ తెలిసేసరికి అశాభంగమయింది. ఈ నోట్ల ముమ్మరపు రోజులలో రెండువందలు రెండురూపాయలకు సమానం! అయితే ఈమాత్రం తన దేశంలో దొరికే ఆస్కారం కనిపించలేదేమరి! అయినా, సుందరం అన్నట్టు, ఇందులో పాతుకుంటే పైకి రాలేకపోమని ఎక్కడుందీ?

మర్నాడు ఆఫీసుకి బయల్దేరే ముందు తనకిట్లా మంచి ఉద్యోగం దొరికినట్టూ త్వరలోనే పెద ఉద్యోగం కాబోయేటట్టూ, తన లీలకు ఉత్తరం రాశాడు విశ్వం. అయితే ఈ ఉత్తరం కాస్త తొందరపడి రాసిన విషయం. ఆఫీసులో చేరినాకగాని విశ్వానికి తట్టలేదు.

సుందరం గడుసువాడే! విశ్వంమీద ఏదో కసి ఉన్నట్టు అతన్ని సరాసరి తనకింద, తన అజమాయిషీలో ఉండే ఉద్యోగంలోనే వేసుకోవటం విశ్వానికి నోటమాట లేకుండా చేసింది. విశ్వం, సుందరం చేస్తున్నంత పెద్ద ఉద్యోగం, నెలకు దాదాపు వెయ్యి రూపాయలూ, ఎన్నడూ కోరలేదు. అయితే, సుందరం, తన్ను కేవలం తనకిందే వేసుకుంటాడని మాత్రం విశ్వం ఎన్నడూ ఊహించలేదు. ఏ మొండి ధైర్యంతో విశ్వం ఈ ఉద్యోగంలో ప్రవేశించాడో ఆనాటినుంచే విశ్వానికి నిజమైన దుర్దినాలు ప్రారంభమైనై.

5

"నువు నాకు ఒక ఉద్యోగమంటూ ఇప్పించినందుకు నేను నీకు కృతజ్ఞత చూపించవలసి వుంటుంది. అయితే నీకు నామీద ఎన్నడూ లేని ఈ కసి ఎందుకు? మనం చాలాకాలంనాటి స్నేహితులం. సమానమైన హోదాలో చదువుకున్నాం. అయితే నీకున్నంత పెద్ద ఉద్యోగం కోసం నేను రాలేదు. మన ఇద్దరికీ అంతస్థులభేదం చాలా ఉందన్నమాట నేను గుర్తించకపోలేదు. నా ముఖానికి ఇంతికన్నా ఎక్కువ ఆదాయం తెచ్చుకోగల తాహతులేదను. నమ్ముతాను, కాని ఆ ఉద్యోగం కాస్తా నీకిందే ఉన్నట్టుచూసి, నన్ను నీ బానిస చేసుకోవటంలో నీ చాతుర్యమేమిటి? ఏ ఉద్దేశంతో నువ్విట్లా అన్యాయంచేశావు? లేక, నీకసలు ఇటువంటి అభిప్రాయమే కలగలేదా?" అంటూ విశ్వం, సుందరాన్ని నిలవేసి అడగాలనుకున్నాడు. కాని, ఎన్నడూ లేనిది తన కీనాడు పిరికితనం ఆవేశించింది. తనకున్న సంస్కారంతో తను ఈ పరిస్థితిని సులభంగానే ఎదుర్కోవచ్చు. "నీ కిందా ఉద్యోగంఉంది! మహాభాగా! మన స్నేహం ఇలా ఉండనియ్యి. నాకు శెలవిప్పించు" అంటూ ఇంకొకడైతే అనగలిగేవాడేమో! కాని, అటువంటి 'పెడసరపు మాట' అనటంవల్ల, ఉన్న అవకాశం కాస్తా పోవటంతప్ప, లాభమేమీ లేదు. పెడసరంగా

మాట్లాడి, పొట్ట పోషించుకునేపాటి ధైర్యం తనకు లేదు అని రూఢి చేసుకున్నాడు విశ్వం.

"మాడూ! నువ్వు కాపరం పెడ్తే బాగుంటుం దనుకుంటాను. ఏం?" అన్నాడు సుందరం ఒక రోజున.

"కాపరం! బాగా చెప్పావు! ఈ జీతంతో నేనేం చేయగలను! ఏదన్నా హోటలుకి పోదా మను కుంటున్నాన్నే." అనేశాడు విశ్వం.

"మంచివాడివే! నిన్నిక్కడినుంచి వెళ్ళి పొమ్మంటున్నా ననుకొంటున్నా వేమిటి? కొంప తీశావు! నాకా అభిప్రాయం ఎన్నడూ లేదు," అంటూ సుందరం తన పొరపాటుకి నొచ్చుకున్నాడు.

"నువలా అనుకోనవసరం లేదు సుందరం?" నేను మాత్రం ఎంతకాలం ఇట్లా నీ యింట్లో తిష్ఠ వేయగలను! రేపు నీ పెళ్లాంపిల్లా వస్తారు. అసలే ఇలు చాలదంటున్నావు కూడను!" అంటూ విశ్వం ఊరుకోకుండా కాస్త ఎత్తిపొడిచాడు.

"ఆ మాటకేం లే. నే నంటున్నది మరేం లేదు. ఇక్కడ ఇళ్ళకు చాలా ఇబ్బంది. అందువల్ల చేతు లారా వచ్చింది జారవిడుచుకోవట మెందుకూ? కింది భాగంలో ఉంటున్న పంజాబీవాళ్ళ యింట్లో, ఒక గదీ, వరండా మీదకట్టిన 'బాత్రీ' గదీ అద్దెకిస్తా మంటున్నారు నీకోసం 'ఫిక్సవ్' చేద్దామనుకుంటు న్నాను. ఉత్తరోత్తరా నాకో బంగాళావస్తే అందులో ఎలాగూ 'అవుట్ హౌస్' ఉంటుంది." అన్నాడు సుందరం.

సుందరాన్ని మనం నిందించవలసిన పనిలేదు. ఎందువల్లనంటే, తన స్నేహితుడికి, తన శక్తిలో ఉన్నంతవరకూ సహాయపడాలనే సానుభూతితోనే సుందరం. ఈ విధమైన ఏర్పా ట్లన్నీ చేస్తూ ఉండవచ్చు. కాని, సుందరం చేస్తున్న ప్రతి పనిలోనూ, విశ్వానికి అంతస్థులే కనిపిస్తు న్నాయి. ఇప్పుడు ఇంటివిషయంలో ఈ అంతస్థుల భేదం స్పష్టంగా ఉండనే ఉంది.

సుందరం, తనకూ, తన భార్యకూ, తన పుట్ట బోయే పిల్లకీ ఇంత ఇంద్రభవన మల్లేఉన్నటువంటిదే చాలదనుకుంటున్నప్పుడు, విశ్వానికీ, విశ్వం భార్యకూ, నాలుగేళ్ళ పిల్లవాడికీ—ఇంకా బహుశా విశ్వం కుటుంబానికంతకీ కూడా, కిందిభాగంలో ఒక గదీ ఒక తాత్కాలికమైన పంచా ఎట్లా సరిపోవచ్చునని సుందరం ఊహించాడో విశ్వానికి అంతుపట్టలేదు.

ఉద్యోగం విషయంలో విశ్వం, సుందరంతో అనదలచిన మాటలు ఎట్లా అనలేకపోయినాడో ఇంటి విషయంలోనూ కూడ అట్లానే నోరెత్తలేకపోయి నాడు.

సుందరం, తన పలుకుబడి బాగానే వినియో గించి, ఆ గదికి అద్దె ముప్ఫయిరూపాయలకు మించ కుండా నిర్ణయించాడు.

కాని, విశ్వం, వెంటనే తన కుటుంబాన్ని రప్పించదలచుకోలేదు. ఒక నెల్లాళ్ళపాటు, ఈ కొట కపు జీవితం రుచిచూశాకనే ఏ నిర్ణయమైనా చేసు కోవాలని నిశ్చయించుకున్నాడు. తన 'సొంత ఇంటి'కి మార్చిన నాటిరాత్రి కూర్చుని, విశ్వం, ఇన్నాళ్ళకి మళ్ళీ ఒక కథ రాశాడు. ఆ కథలో ఇటీవల తను పొందిన అనుభవాల ఛాయలు కొన్ని పడకపోలేదు. ఆ రాత్రి అతనికి గుండె కాస్త తేలికై బాగా నిద్ర కూడా పట్టింది.

పంజాబీల చంటిపిల్ల యేడుపుతో ఒకరా త్రప్పుడు విశ్వానికి మెలకువయింది. మళ్ళీ ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. రాత్రి బహుశా రెండుగంటలు దాటిఉంటుంది. అంతవరకూ తనకు పట్టిన నిద్రకు మనసు ప్రశాంతంగానే ఉన్నట్టు తోచింది కాని, ఈ సరికొత్త వాతావరణంలో నిద్ర పట్టం కష్టంగా తోచింది. రాత్రి కథ రాయటం వల్లా, మనసులో ఉంటున్న బాధ కాస్తా ఆ కథలో కొంతవరకు వ్యక్తం కావటంవల్లా, చప్పున పట్టిన నిద్ర కేవలం తాత్కాలికమయిపోయింది విశ్వానికి.

విశ్వం అట్లా పడుకునే ఆలోచనలో పడ్డాడు. అతనికి, తన కుటుంబం యావత్తూ జ్ఞాపక మొచ్చి కల వరమవుతోంది. తమ్ముడేం చేస్తూనన్నాడో! పిల్ల వాడి ఆరోగ్యంగురించి లీల ఉత్తరమే రాసింది కాదు. ఇల్లు ఎలా గడుస్తున్నదో! దినం ఎట్లా గడ వటమనే మహాసమస్య ఎదురైనప్పుడు, ఇంకే సమస్య గురించీ ఆశే ఆలోచన పోదు. ఇందులో కేవలం తన సుఖం మాత్రమే చూసుకొంటున్నట్టవుతున్నదా? తను ఏ సుఖం పొంది, తనవారిని సుఖపెట్టాలని

విశ్వం, ఇంతదూరం వచ్చాడో, ఆ సుఖం కాస్తా మాయమయినట్టు తోచసాగింది.

పాపం సుందరం ఒక విధంగా మంచివాడే. తను చేయగలిగిందేదో చేస్తూ ఉండగలగటం సుందరం వంటి వ్యక్తిలో గొప్పగుణం కాక మరేమిటి? ఆ చేయవలసిన పద్ధతిలో లోపముంటే ఉండవచ్చు. లోపాలు అనేవి మనిషికి ఎన్ని లేవు? అయితే సుందరం స్నేహాన్ని ప్రదర్శించటంతో, తన మనసు కష్టపడుతున్న సంగతి సుందరం గ్రహించలేదనుకోవచ్చు. సుందరం చేస్తున్నది సహాయంగా పరిగణించటంతో 'ఇదిగో! నువ్వు పని ఇట్లా చేస్తున్నందువల్ల, నా మనసు కష్టపడుతోంది. నా అభిమానం రెచ్చుతోంది' అని అనగలిగే శక్తి తనకు లేకుండా పోయింది. ఎంత ఆలోచించినాసరే, ఈ విషయంలో సుందరంలో మంచితనమే తనకు కనిపిస్తున్నదిగాని, అతనిలో లోపం కనపడటం లేదు. సుందరానికి తను ఉంటున్న అంతస్థులోంచి అతనికి కనుపించేది, విశ్వానికి తన అంతస్థులోంచి వేరేవిధంగా కనిపించటం సహజం. మానసికంగా తన్ను హింసించాలని సుందరం అభిప్రాయం ఎన్నటికీ కాకపోవచ్చు. కాని, యధార్థం ఆలోచిస్తే, తను పడుతున్నది మానసిక వ్యథే!

తను మధ్యతరగతిలో కింది వర్గానికి చెందినవాడనీ, ఈ వర్గానికి చెందినవారు, సాంఘిక వ్యవస్థలో నిలపడటానికి చేసే ప్రయత్నంలో, పైకి ఎగబాకనూ లేరనీ, కిందకు దిగజారనూ లేరనీ, ధనిక వ్యవస్థలో తనవంటివారిది గబ్బిలాల జీవితంగా ఉంటుందనీ కథకుడైన విశ్వం గుర్తించకపోలేదు. అయితే, తనకే సంభవించిన ఈ పరిస్థితిలో తనపై ప్రత్యేకత చూపించుకోగలిగాడు గనక?

ఈ సంఘంలో తనవంటివారు పడుతున్న మామూలు కష్టాలే తనూ పడుతున్నాడు. ఈ కష్టాలేమీ లేకుండా, సమాజంలో ప్రతీవ్యక్తీ కూడా, సరిసమాన బాధ్యతలుగల వ్యక్తి అనీ, పరస్పర గౌరవ మర్యాదలూ హక్కులూ కలవాడనీ, సమాజం యావత్తూ కూడా గుర్తించగలిగే సామ్యవాదంలో తప్ప, ఈ అంతస్థులు తొలగిపోవన్న సత్యం గ్రహించాడు విశ్వం. సుందరం ఉన్నటువంటి అంతస్థులు నిర్మించటానికి ఈ సమాజం బోలెడంత అవకాశం ఇచ్చింది. ఇక సుందరంలో ఉన్న లోపమల్లా ఎక్కడంటే—ఈ అంతస్థుల భేదాన్ని, అంత చదువుకున్నవాడైనా, ప్రపంచాన్ని చూసినవాడైనా, గుర్తించకపోవటం. అతను ప్రపంచాన్ని భౌతికంగా మాత్రమే చూడగలిగాడుగాని, తనలాగా నైతిక దృష్టిలో చూడలేదు. సుందరం ఏనాడైతే తన బుద్ధి అనుభవమూ సక్రమంగా వినియోగించి, ఈ అంతస్థుల్ని గుర్తిస్తాడో అప్పుడే, దిగివస్తాడు. కనీసం ఈ యధార్థం సుందరం ఇదివరకు గుర్తించి ఉన్నట్టయితే, తన్ను—అంటే విశ్వాన్ని—సరాసరి తన కిందే 'బానిస'గా చేసుకొని ఉండడు. ఈ అంతస్థుల భేదంవల్లనే, సుందరం, స్నేహాన్ని ప్రదర్శించగలిగినప్పటికీ, స్నేహానికి ఉండవలసిన—చూపవలసిన—గౌరవం ఉంచనూ లేదు—చూపనూ లేదు.

ఈ ఆలోచనలతోనే విశ్వం ఎప్పుడు నిద్రపోయినాడో గాని, మళ్ళీ మెలకువ వచ్చేసరికి, ఉదయం ఎనిమిది దాటింది.

6

లీల ఉత్తరం రాసింది. పిల్లవాడికి నాలుగైదు రోజులై జ్వరం వస్తున్నదనీ, నాన్నగారికి ముక్కు పట్టుకుపోయి లేవ లేకుండా ఉన్నారనీ, పూటగడవటం అతికష్టమయిపోతున్నదనీ, పాపం మరిదే, తికమకలుపడుతూ, బండీ లాగుతున్నాడనీ, తన చెల్లెలి సహాయమే లేకుంటే ఏమయ్యేదానో అనీ, అమ్మకి ఎప్పుడూ తనగురించే విచారంగా ఉంటున్నదనీ...

ఇంతకన్న ఆశాజనకమైన ఉత్తరం వస్తుందని విశ్వం ఎన్నడూ ఆశించలేదుగాని, కనీసం, అంతా క్షేమంగా ఉన్నారనివస్తే చాలుననుకున్నాడు. ఈ పరిస్థితిలో తను చేయగలిగేదేమిటో స్పష్టంగా కనిపించటం లేదు. ఒకసారి పోయివస్తే? శలవూ డబ్బూ రెండూ కావాలి. శలవు సుందరాన్ని అడిగితే ఇవ్వకపోడు. కాని మొదటినెలఅంటే జీతంలో సగం ఇంటికి పంపాలా, తన ప్రయాణానికి ఖర్చు చెయ్యాలా? ఇదివరకు చేసుకొచ్చిన అప్పు వంద రూపాయలూ తీర్చేదెవరు?

మనిషికి కొంతవరకైనా తెగింపంటూ ఉంటేనేగాని బతకటం కష్టం. తెగించి ఊరికి వెళ్ల

కుండా ఉంటేనే మంచిది. ఆ ప్రయాణానికి అయ్యే ఖర్చుతో మరికొంత కలిపి, జీతంలో సగం, ఇంటికే పంపేస్తే వాళ్ళే ఏదో తంటాలు పడతారు. అంతేగాని, ఈవిషయం సుందరంతో చర్చించి లాభం లేదు.

మొదటితారీఖు రాగానే, జీతం కూడా ముట్టింది. విశ్వం, ముప్ఫయిరూపాయలు ఇంటికి అద్దె ఇచ్చి, మరో నలభై, హోటలుకి ఇచ్చాడు. తన చెయికాపుకి ఇంకో ముప్ఫయిఉంచుకొని, మిగతా నూటపదిరూపాయలు ఇంటికి మనియార్డరుచేస్తూ, లీలకీ, తమ్ముడికీ ఉత్తరాలు రాశాడు. ఆనాడే, తను రాసిన కథకూడా పత్రిక్కి పంపించాడు.

ఆఫీసులో పని అంత మెదడుతో కూడుకున్నది కాదు. బండచాకిరీ బోలెడుంది.

అయితే ఇందులో పేచీ ఎక్కడ వస్తూన్నదంటే, సుందరం చేసే ప్రతీ పనిలోనూ, ఆడే ప్రతీ మాటలోనూ ఏదో అధికారం చెలాయిస్తూన్నట్టుగా తోచసాగింది విశ్వానికి. ఇది రాను రాను భరించడం కూడా కష్టమవుతోంది. అదీకాక, సుందరం కొత్త 'చేయితడి' చేసుకుంటూ ఉండటం విశ్వానికి చాలా అసహ్యం వేసింది. లంచాలు పుచ్చుకోవటం, ఇవ్వటం తమాషాగా ఒక చక్రం తిరిగినట్టు తిరుగుతుంది. దీనికి సుందరం ఎట్లా అలవాటు పడ్డాడో పరమాత్ముడికే తెలియాలి. ఈ విషయం సుందరంతోనే, తన స్నేహాన్ని పురస్కరించుకొని ప్రస్తావించినా, అతనికి కోపమూ రావచ్చు. మొదటికే మోసం కలగవచ్చు. ఎవరి ఖర్మం వారిది.

ఒకనాడు సుందరం, తనతో-'చూడు విశ్వం-నువు మొన్నటి ఫైలుమీద రాయకూడని విషయాలు చాలా రాశావు. ప్రభుత్వోద్యోగంలో అటువంటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నీకు తెలీకపోతే నన్నడగాలి. అంతేగాని, నీకు తోచిందే న్యాయం అనుకుని రాసిపారెయ్య రాదు. దానివల్ల ఎంత నష్టం వచ్చిందో చూడు. ఖస్ ఖస్ తడకలు, కొంత కాలానికి వేయించడంలో, మనకు పాతిక వేల రూపాయలు శాంక్షను ఉంది. అంటే ఆ డబ్బంతా ఖర్చు చేయాలని కాదు. కొంత ఆదా చూపటానికే మనం ఇక్కడుంటున్నది!" అంటూ వెళ్ళిపోయినాడు.

ఈ మాటలతో విశ్వానికి యథార్థం బోధపడ్డది. తన బుద్ధి ప్రయోగించి, ఆ ఫైలులో తనకు తోచిన దేదో రాయటంవల్ల, సుందరం ఈ వ్యవహారంలో చేసుకుందా మనుకున్న అయిదు వేల రూపాయలూ కంట్రాక్టరుకే దక్కాలి. అయితే, ఇప్పుడు సుందరం వ్యవహారం బయటపడకుండా, ఆ అయిదు వేల రూపాయలూ ప్రభుత్వానికి ఆదాగా ఉన్నట్టు చూపించి ఊరుకున్నాడు.

తెల్లవారి లేస్తే ఇటువంటివి లక్ష జరుగుతున్నాయి. ఇటువంటివి చూస్తూ బయటకు రావటం ఎన్నాళ్లు? తనవంటివాడికి దొరక్క దొరక్క ఈ దిక్కుమాలిన ఉద్యోగం దొరికిందేమిటి? లంచాలు బాగా పట్టగలిగే వారికీ, పై వాడు ఏమన్నా పడి ఉంటూ ఉండేవారికీ ఈ ఉద్యోగాలు.

"పిల్లవాడికి జ్వరం తగ్గినా, రోజూ కొద్దిగా వస్తూనే ఉంది. వాడు మీకోసం బెంగపెట్టుకున్నట్టు కనిపిస్తూంది. రాత్రులు పలవరిస్తాడు. మీ నాన్నగారికి ఇప్పుడు కొంచెం నయంగానే ఉంది. మీరు పంపిన డబ్బుతో ఈ నెల గడుస్తుంది. మీరు ఊరికి వెళ్ళటానికి చేసిన అప్పు మీ తమ్ముడు తీర్చాడు. ఎట్లా తీర్చాడో ఎవరికీ చెప్పడు."

ఈ ఉత్తరంలో తను బెంగపెట్టుకోటానికీ ఉంది. సంతోషించటానికీ ఉంది. అవమానం పొందటానికీ ఉంది. తనకన్న తన తమ్ముడే అనేకరెట్లు నయం!

ఈసారి తమ్ముడి ఉత్తరంకూడా లీల ఉత్తరంతోపాటు వచ్చింది.

..."నువు ఇక్కడి పరిస్థితులగురించి బెంగపెట్టుకోకు. అంతా క్షేమమే—నీ ఉద్యోగం మట్టుకు స్థిరంగా ఉండేటట్టు చూచుకో. ఏ పరిస్థితులలోనూ కూడా, అది వొదిలిపెట్టెయ్యకు. నువు కోరితే, వొదినెనూ, పిల్లవాడినీ తెచ్చి దిగపెట్టటానికి నేను సిద్ధంగా లేననుకోకు... అన్నట్టు ఈనెల పత్రికలో నీకథ చదివాను..."

తమ్ముడికి ఇప్పుడున్నటువంటి ప్రపంచ జ్ఞానం, తమ్ముడి ఈడులో తనుఉండినప్పుడు తనకు లేకపోయినందుకు విశ్వం చింతించలేదు. రోజు రోజుకీ ప్రపంచమే కూలిపోతోంది. పరిమాణాలు ఎక్కువవుతున్నాయి. ఏనాటి పరిమాణాలకు

తగ్గట్టుగా ఆనాటి బుద్ధికూడా వికసింపచేసుకోవటం లోనే ఉంది మనిషి అభ్యుదయం అంతానూ.

తనకథ పడిన పత్రిక తనకు ఎందుకు రాలేదా అని ఆలోచిస్తూ ఉండగానే సుందరం వచ్చి నిజం బయటపెట్టాడు.

"నీ పేర ఒక పత్రిక వచ్చిందోయ్, ఇంద. నీ అనుమతి లేకుండా, పత్రికే కదా అని చూడటం తటస్థించింది. అయితే అదీ మంచికే అయింది. చూడూ! నువు కథలు రాయటం బాగానే ఉంది. రాయగలిగే వాడు రాస్తూ ఉండాలికూడానూ. నువుకూడా ప్రభుత్వోద్యోగివి గనక చెప్తున్నా ననుకో. నిబంధనలప్రకారం మనం అసలు ఏదీ ఇట్లా రాసి అచ్చువేయించగాదు. ఒక కథ రాస్తే, దాన్ని పత్రికకు పంపేముందు పర్మిషన్ తీసుకో వలసివుంటుంది లేకుంటే ఎంతేనా పేచీ వస్తుంది. అది నాచేతిలో ఉన్నపనే అనుకో. నువొక దర ఖాస్తు పెట్టు పర్మిషన్ ఇచ్చినట్టు నేను చేసే స్తానులే."

ఇది విశ్వం ఇదివరకు ఎరిగి ఉన్నదే. అయితే, ఈ బాధ, రాజకీయాలకు సంబంధించినవాటికే కాకుండా, మామూలుగా ఒక కథ రాసినా, ఉంటుం దనిమాత్రం విశ్వం ఊహించుకోలేకపోయినాడు. మనకు స్వతంత్రం అంటే వచ్చిందనుకుంటు న్నాంగాని, ప్రభుత్వం మారలేదనీ, స్వాతంత్ర్య వ్యవస్థకి తగ్గట్టుగా ప్రభుత్వోద్యోగాల నిబంధనలు పరిణామం చెందరాలేదనీ విశ్వం గుర్తించాడు.

ఇప్పుడు తను కథలు రాయటానికి ముందు 'పర్మిషను' పుచ్చుకోవాలి. ఇదైనా మళ్లా, తన స్నేహితుడు—సుందరం—ఇవ్వాలి! సుందరం అను మతిస్తేనే తను కథ లంటూ రాయగలడన్నమాట! ఈస్థితిలో తను సాహిత్యసేవకు తిలోదకాలన్నా ఇవ్వాలి. లేదా ఉద్యోగానికైనా పాట పాడె య్యాలి అంతేగాని, ఈపర్మిషనూ వ్యవహారం విశ్వానికి నచ్చలేదు.

7

విశ్వానికి ఈ చాకిరీ నచ్చటం లేదన్న విషయం మొదట్నుంచీ తెలుస్తూనే ఉంది. దీనికి కాలపరిమితి కూడా, మరో నెల్లాళ్ళలో పూర్తి కాబోతుందని, విశ్వం ఉద్యోగంలో ప్రవేశించిననాడే తెలుసుకు న్నాడు. సుందరం ఆ విషయం ఎందుకు దాచాడో, ఇప్పుడు సుందరం, దీని కాలపరిమితి మరో మూడు నెలలకు పెంచటానికి చేస్తున్న ప్రయత్నంవల్ల బోధ పడుతున్నది విశ్వానికి. ఇప్పటికి రెండు నెలలకు పైగా ఈ బండ చాకిరీ చేయటమే కాక, సుందరానికి అయిదువేల రూపాయలు నష్టం తీసుకురావటంతో సుందరానికి బాగా దూరమైనాడుకూడానూ. ఇప్పుడు సుందరం—తనతో పూర్వపుస్నేహంతో గానీ, ఆ ధోరణిలో గానీ, ఆ ఆప్యాయంతో గానీ మాట్లాడటం లేదు. పైగా ఒకవేళ ఏదన్నా అవసరమొచ్చి, సుందరం మాట్లాడినా, అది తన మనసుని, నిశ్చితంగా కష్టపెడ్తున్నది. సుందరం అంతకన్నా ఎక్కువ సంస్కారయుక్తంగా ఎందుకు మాట్లాడడో విశ్వం తరిచిచూస్తే మళ్లా అతనికి అంతస్థులే కని పించసాగాయి.

ఈ ఉద్యోగంలో తను, ఇంతవరకూ సాధించిం దేమిటి? ఏంసాధించా లనుకున్నా ఇంత త్వరలో తేలే విషయం కాకపోవచ్చు. కాని, దాని సూచన అన్నా కనిపించకపోవటంలో అర్థం లేదు పైగా, తను చేసే ప్రతీ పనికీ అడ్డుపుల్లలు అధికమవుతు న్నాయి. ఇది భరించటం చాలా కష్టం. ఇదిలా ఉండగా, ఈ ఉద్యోగంవల్ల, విశ్వం, తన వాళ్ళకు దూరమైనాడే గాని, దగ్గర పడే సూచన లేమీ కన పటం లేదు.

ఈమధ్యనే తన కొక రోజు తల భారమై, జ్వరం లక్షణాలు తగిలి లంఖణంతో ఉంటే - శెలవు చీటీ పంపించటం—"ఈ మాత్రానికి శెల వేమిటోయ్! రెండు 'ఆస్ప్రిన్' మాత్రలు తిను" అంటూ సుందరం తన్ను ఆఫీసుకి రమ్మని ప్రత్యేకంగా కబురుచేయటం జరిగిందికూడాను! అంటే, తనకు కనీసం శెలవు, కావలసినపుడు దొరకటం—సుందరం అజమాయిషీలో కష్టమని కూడాబుజువైంది.

ఇటువంటి చాకిరీ చేయటానికి సిద్ధపడేవాడు ముందుగా తన ఆత్మాభిమానం చంపుకోవాలి. ఇట్లా ఆత్మాభిమానం చంపుకోవటం కనీసం తనవంటివానికి చేతకాని పని. తన ఆత్మాభిమానాన్ని అప్పుడప్పుడు గాయపరిచేటంతవరకూ ముందుకు సాగాడు విశ్వం. కాని, ఇప్పుడు పూర్తిగా దాన్ని చంపుకుంటేనే

గాని, ఇందులో మోక్షం సాధించటం సాధ్యపడదని విశ్వసించాడు. తనకు చేతకాని పని చేయటానికి— అందులో, ఆత్మాభిమానం చంపుకొనటానికి, తెగించేటంత ద్రోహం మరొకటి లేదు.

ఆనాటిరాత్రి, విశ్వం, ఇవే ఆలోచనలతో ఒక కథ రాయాలని మళ్లీ సంకల్పించాడు. కాని, అది కథగా రావటం మానేసి, ఒక ఉత్తరంగా పరిణమించింది. ఇది అనుకోకుండా జరిగినటువంటిది. ఆ ఉత్తరం సుందరానికి ఉద్దేశించింది.

8

"మైడియర్ సుందరం! ఈ ఉత్తరాన్ని నాపై అధికారిగాఉన్న సుందరానికి కాకుండా, నా స్నేహితుడైన సుందరానికి రాస్తున్నాననుకొంటావనే నా విశ్వాసం. ఈ ఉత్తరాన్ని నీకు ఎందుకు రాస్తున్నానో నన్నడక్కు. నిజానికి నేను ఈరాత్రి, ఒక కథ రాయాలని కూర్చున్నాను. తీరా చూస్తే ఇది ఇలా ప్రారంభమైంది. అయితే ఇదీ ఒక కథలాగే తోచవచ్చు. కనక దాన్ని ఇంతటితో ఆపేయకుండా పూర్తి చేస్తున్నాను.

నాకు స్నేహితులంటే పరమ గౌరవం. నా స్నేహితులలో నిన్నే అందరికన్నా ఎక్కువగా భావించుకొంటూ ఉంటాను. నువు నాకు చేసిన సేవకీ, చూపిన సానుభూతికీ అంతకన్నా ఉత్తమమైన పద్ధతిలో నా కృతజ్ఞత తెలియచేసుకోవడం నాకు చాతకాదు.

నేను సహజంగా కథకుణ్ణి. ఈరాత్రి కథ రాద్దామంటే, ఇది ఈ ఉత్తరంగా పరిణమించటానికి కారణం. కథ రాస్తే అది ప్రకటించుకోటానికి, నా సాటివాడివైన నీ అనుమతి, అధికారపూర్వకంగా పొందాలి. ఆ మాటకూడా నువ్వే పాపం— నామంచికే ఆలోచించి అన్నావు. కాని, నాకిది సరిపడదు. నాస్వేచ్ఛని ఈవిధంగా నేను ఇంకొకరి చేతిలో బంధించివేయలేను. అందువల్ల, ఈ ఉద్యోగంలో ఉండిన ఆఖరు క్షణంవరకూ నాలో ఉన్న కథకుడు నిద్రపోతూ ఉండాలి.

మనం సరిసమానమైన హోదాలో ఉండే స్నేహితులం. ఈ స్నేహానికి భంగం రావడం నేను భరించలేను. నేను చాలా సెన్సిటివ్‌గా ఉంటున్నానని అనుకొంటున్నావా? నిజమే అందుకే నావంటివాళ్లకి ఇటువంటి ఉద్యోగాలలో స్థానంలేదని గుర్తించాను. నీతో నాకుండిన స్నేహాన్ని పురస్కరించుకొని, నాకొక ఉద్యోగం చూసిపెట్టమంటూ నీకుత్తరం రాశాను. నా ఊహకు అతీతంగా పాపం నువు నన్ను ఆదరించి, నీ అభిమానంతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేశావు. నిన్ను నేను తప్పుపడ్తున్నాననుకోకు. స్నేహితుడనేవాడు నీ అంతస్థులో ఉంటే, నువ్వు చేసినదానికన్నా ఎక్కువ ఎవడూ చేయలేడనుకో. అయితే ఒక యథార్థం చెపుతాను. నువ్వు కేవలం నీకిందే నన్ను వేసుకుంటావని మాత్రం నేనెన్నడూ కలలోకూడా ఊహించలేదు. నన్ను స్నేహితుడిగా ఆదరించిన వాడివి, స్నేహాన్ని గౌరవిస్తావనే విశ్వసించాను. అయితే, నువు చేసిన ఈపనిలో, మన స్నేహానికి అగౌరవం కలిగిందని నువు గుర్తించకపోవచ్చు, అంతస్థుల భేదంవల్ల, అది, కిందనుంచి నేను గమనించాను. పైనున్నవాడివి, నీ కాట్టే కనపడదది.

నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ. నీ అధికారాన్ని నేను గౌరవంగా చూసి, దానికి అణిగిపోయినప్పుడు నా ఆత్మాభిమానాన్ని చాలా మట్టుకు గాయపరుచుకున్నాను.

చూస్తూ చూస్తూ నేను అన్యాయానికి తల వొంచలేను. న్యాయంగా నేను రాయవలసిన దేదో రాస్తే, దానిమూలంగా అయిదువేలరూపాయలు ప్రభుత్వానికి ఆదా కనిపించింది. ఆ ఆదా నువు చేసినట్టే రికార్డులో చిక్కించుకొన్నావంటే, నువు అధికారికి గనక నేను కాదనను. అయితే ఆదా జరుగుతున్నప్పుడే, 'ఆదా చేయటానికే మనం ఉన్నాం' అని నువ్వప్పుడు నాతో అనటంలో, నాకు కించిత్తు నైచ్యం కనిపించింది. బహుశా ఆ సొమ్ము నేదో కార్యార్థం ఉపయోగించాలని నువు ఉద్దేశించి ఉండవచ్చును. ఈ పద్ధతి నాకు నచ్చదు. నేను ఉద్యోగరీత్యా ఇక్కడ అతి అల్పుణ్ణి. నామాట ఎవరు పాటిస్తారు?

నాకు ఒకరోజు శెలవు కావాలంటే నువు అభ్యంతరం చెప్పావు. బహుశా అభ్యంతరం చెప్పవలసిన అవసరం ఉందని నీకు తోచిందేమో. కాని,

ఈ చర్య, మనిషిశక్తిని దుర్వినియోగపరుచుకుంటున్నట్టుగా నా కర్థమయింది.

ఇదీకాక, ప్రతీ చిన్నవిషయంలోనూ నేను నీకు తలవొంచిఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. నిన్ను నేను, స్నేహితుడిగా ఎంచుకోవడం మూలాన, నా ఆత్మాభిమానం బాగా దెబ్బ తిన్నదేగాని, నీ స్థానంలో నాకు తెలియనివాడు ఇంకొకడున్నా, నేను బాధపడవలసినవాణ్ణే. నా స్వభావమే అంత. ఈ బాధకు నేను తట్టుకోలేను.

'ఉద్యోగమంటే, తీరికూర్చొని సుష్టుగా భోంచేయటమా?' అని నువ్వు ప్రశ్నిస్తావు. కాని, తీరికూర్చొని సుష్టుగా భోంచేయటంమాట ఎలా ఉన్నా, ఉద్యోగమంటే. ఇప్పుడున్నంత హీనంగా లంచగొండివ్యవహారంగా, అధికారమదాంధతగా, మానవత్వరహితంగా హృదయశూన్యంగా ఉంటుందని మాత్రం నేను అనుకోలేదు.

ఇంతెందుకూ? నా అంతస్థు వేరు. అది చాలా పైనుంది. నేను, నీ దృష్టిలో చాలా దిగువ ఉన్నానన్నమాట నిజం. మానసికంగా, సంస్కారంగా నేనెంతో పైమెట్టులో ఉన్నా యధార్థం నువు గుర్తించ నవసరంలేదు కూడాను. దానివల్ల నీకూ నాకూ కూడా ప్రయోజనమంటూ ఏదీ ఉండదు.

పోతే, నేను ఇక్కడికి నీ ధర్మమా అని వచ్చి, నా వాళ్లకు చాలా దూరమైపోయినాను. నా తమ్ముడు నన్నీ ఉద్యోగం వొదులుకోవద్దన్నాడు. పాపం! వాడికేం తెలుసు నావంటి వాడి మానసిక బాధ! ఈ పరిస్థితిలో నేను నా కుటుంబాన్ని ఇక్కడికి రప్పించనూ లేను. నేను వెళ్లనూ లేను. నావంటివాళ్లు ఇక్కడ అనేక వందలమంది ఎలా బతుక్కొస్తూన్నారంటే అది వేరే మాట. అందరూ నావంటివాళ్లెలా అవుతారు! అందరికీ ఆత్మాభిమానాలు లేవని కూడా నేననలేను. వాళ్ళ పరిస్థితులు భిన్నమై ఉండవచ్చును. వాటికి తట్టుకోగలిగేవారు నిలబడుతున్నారు. తట్టుకోలేని నావంటివాళ్లు, ఈ వ్యవస్థలో ఇరుక్కోలేక పాతాళంలో పడిపోతున్నారు. కాని, నేనింత హీనంగా పాతాళంలో పడిపోననే ధైర్యం నాకుంది. నన్ను లక్ష్మి కటాక్షించకపోయినా సరస్వతి కాస్త వోరకంటితో చూస్తోంది. ఇదివర కెలా జీవితం గడిపానో అలాగే గడపకపోను. బహుశా, పరిస్థితులు అనుకూలంగా ఉంటే, ఇంకా గౌరవంగానే బతగ్గలనని నా ధైర్యం.

ఇక్కడితో నా చాకిరీ కాలపరిమితి కూడా పూర్తికాబోతున్నది. రేపు జీతంపుచ్చేసుకొని, నా మానాన నేను పోతున్నాను. నన్నేదో ఉద్ధరించాలని మాత్రం ఈ ఉద్యోగం అనవసరంగా పొడిగించి, ప్రభుత్వానికి కలగబోయే ఆదాయం కలగకుండా చేయకు. అవసరమే ఉంటే, మరో 'స్నేహితుణ్ణి' వేసుకో. మన స్నేహంమాత్రం ఈ విధంగా కాపాడుకుంటే ఇదే చాలు.

అసలు, ఈ నాలుగు ముక్కలూ నీముఖం ముందు చెప్పే అధికారం నాకుంది. అయితే, నా అధికారం మన స్నేహంనుంచి వచ్చినది. ఇంత మట్టుకూ ఈవిధంగా రెచ్చిఉన్న ఈ స్నేహానికి ఇంక అధికార మేముంటుంది? అదీకాక, గాయపడ్డ నా మానాభిమానాలతో, నీముఖం ముందు, నామనసులో ఉన్న ముక్కలు చెప్పలేకపోయినాను. అందువల్లనే ఈ ఉత్తరం ఇలా పరిణమించింది.

నేనింత పొడుగాటిఉత్తరం రాసినందుకు నన్ను క్షమించు. ఉన్నవిషయం కాస్తా రాసేస్తే, నేను, ఇటీవల నామీద పట్టిన బూజుదులుపుకొన్నట్టవుతుంది. నీ ఎప్పటి సానుభూతితోనే దీన్ని చదువుకొని, నన్ను అర్థంచేసుకోటానికి ప్రయత్నించు. ఇదే నిన్ను నేను కోరబోతున్న చిన్ని కోరిక.

నీ విశ్వం.

పరా—ఈ ఉత్తరంతోపాటు, నా రాజీనామా ఉత్తరంకూడా జతపరిచాను. ఉద్యోగ కాలపరిమితి అయిపోయింది గనక, దాని అవసరం లేదు. అయినా అవసరం ఉంటుందేమో అని, పంపిస్తున్నాను. స్వీకరించు—

అంతస్థుల భేదంవల్ల, ఈ ఉత్తరానికి సమాధాన మేమిటని నువు అనుకోవచ్చు. నీ సమాధానం కోసం నేను ఎదురు చూడనులే. అయితే, ఎటువంటి సమాధాన మివ్వాలి? అని మాత్రం నువ్వు కాస్త ఆలోచించినపక్షంలోమాత్రం ఈ వ్యవస్థలో ఒక పెద్ద విప్లవం రావటానికి సిద్ధంగా ఉందనుకో—నీ విశ్వం,"

———